క్లుప్తంగా

నేడు నూతన భవన నిర్మాణానికి భూమిపూజ

కోస్గి రూరల్: పట్టణంలోని అదనపు తరగతిగదులు, మండల సముదాయ భవన నిర్మాణానికి భూమి పూజ చేపట్టనున్నట్లు మున్సిపల్ పట్టణ అధ్యక్షుడు బెజ్జురాములు, గుండుమాల్ మండల అధ్యక్షుడు విక్రంరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గుండుమాల్‌లోని భూమిపూజకు నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి, కడా ప్రత్యేక అధికారి వెంకట్ రెడ్డి పాల్గొనున్నారని, సంబంధిత అధికారులు పాల్గొనాలని కోరారు.

వచ్చేనెల 16న జాతీయ స్థాయి కరాటే పోటీలు

నారాయణ పేట టౌన్: జాతీయ స్థాయి కరాటే పోటీలను వచ్చేనెల 16న జిల్లా కేంద్రంలోని స్థానిక ఎస్‌ఆర్ గార్డెన్‌లో నిర్వహిస్తున్నట్లు స్థానిక కరాటే మాస్టర్లు తెలిపారు. ఈ సందర్భంగా వారు పట్టణంలోని వివేకానంద పార్క్‌లో టోర్నమెంట్ బ్రోచర్లను ఆవిష్కరించారు. ఈ పోటీల్లో పాల్గొనేందుకు దాదాపు 11రాష్ట్రాల నుంచి విద్యార్థులు, కరాటే మాస్టర్లు రానున్నట్లు తెలిపారు.

తిరుమలలో కోటకొండ భజన మండలి




నారాయణపేట రూరల్ : మండలంలోని కోటకొండకు చెందిన మారుతి భజన మండలి సభ్యులు తిరుమలలో టీటీడీ ఆధ్వర్యంలో కొనసాగుతున్న అఖండ హరినామ సంకీర్తనలలో పాల్గొన్నారు. ఈ ఈ సందర్భంగా స్వామివారి నామస్మరణ, కీర్తనలు అలపించడం పూర్వజన్మ సుకృతమని అన్నారు. కార్యక్రమంలో కాశీనాథ్, సురేష్, శ్రీను, కాశప్ప, గోపాల్, వెంకటయ్య, చిట్టిబాబు, రాజు తదితరులు పాల్గొన్నారు.

కోడి పందేల స్థావరంపై దాడి

మక్తల్: మండలంలోని గుడిగండ్ల శివారులో కొంతమంది వ్యక్తులు కోడి పందేలు ఆడుతున్న సమాచారం తెలుసుకుని టాస్క్‌ఫోర్స్ పోలీసులు స్థావరాలపై బుధవారం రాత్రి దాడులు చేసి ముగ్గురిని పట్టుకున్నారు. వీరిని స్థానిక పోలీస్‌స్టేషన్‌కు అప్పగించారు. వారి వద్దనుంచి రూ.10వేలు, పది ద్విచక్రవాహనాలు స్వాధీనం చేసుకుని కేసునమోదు చేసినట్లు ఎస్‌ఐ-2 ఆచారి తెలిపారు.

జీఎస్‌ఎల్‌వీ ఆకారంలో విద్యార్థులు



మరికల్: భారత అంతరిక్ష పరిశోధన సంస్థ ఇస్రో చేపట్టిన వందవ రాకెట్ ప్రయోగం విజయవంతం కావడంతో బుధవారం మండల కేంద్రంలోని పాఠశాల విద్యార్థులు జీఎస్‌ఎల్‌వీ-15 ఆకారంలో కూర్చొని సైంటిస్టులకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రపంచ దేశాల సరసన భారతదేశం నిలవడం శాస్త్రజ్ఞుల కృషి మరవలేమని ఉపాధ్యాయులు కొనియాడారు.

పరుగు పందెం పోటీలో బంగారు పతకం



మాగనూర్: మండల పరిధిలోని కొల్పూర్‌కు చెందిన దివ్యాంగుడు లింగప్ప వంద మీటర్ల పరుగు పందెం పోటీలో బంగారు పతకం సాధించారు. ఈ నెల 28న రాష్ట్ర స్థాయి పరుగు పందెం పోటీలు హైదారాబాద్‌లోని గచ్చిబౌలి స్టేడియంలో జరిగిన జిల్లా స్థాయి పోటీలో మొదటిస్థానం సాధించి బంగారు పతకం సొంత చేసుకున్నారు. గ్రామస్తులు లింగప్పను ప్రత్యేకంగా అభినందించారు.

మందకృష్ణ మాదిగకు స్వాగతం

మరికల్: పేట జిల్లా కేంద్రానికి వెళ్తున్న ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మందకృష్ణ మాదిగకు మరికల్‌లో నాయకులు బుధవారం రాత్రి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన అభివాదం చేసుకుంటూ జిల్లా కేంద్రానికి వెళ్లిపోయారు. రామస్వామి, బాల్‌రాజ్, బాలకిష్ణ, మాసప్ప, గోపాల్, శ్రీను, చంద్రయ్య, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.



అద్దెభవనాల్లో అంగన్‌వాడీ కేంద్రాలు

- మరమ్మతుకు నోచుకోని సొంత భవనాలు
- ప్రభుత్వ భవనాల్లో 28 కేంద్రాలు
- సొంత భవనాల్లో-19 కేంద్రాలు
- తప్పని ఇబ్బందులు



శిథిలావస్థలో ఉన్న గడిముస్కన్‌పల్లి అంగన్‌వాడీ భవనం



అద్దెభవనంలో క్యాతన్‌పల్లి అంగన్‌వాడీ కేంద్రం నిర్వహణ

దామరగిద్ద: గ్రామీణ ప్రాంతాల్లో చిన్నారులకు పూర్వ ప్రాథమిక విద్యతో పాటు ఆరోగ్య సేవలను పౌష్టికాహారాన్ని అందించి విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి కృషిచేసేందుకు కొనసాగుతున్న అంగన్‌వాడీ కేంద్రాల్లో అసౌకర్యాల మధ్య కొట్టుమిట్టాడుతున్నాయి. మండలంలోని పలు గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాలు ఉన్న మరమ్మతులు చేపట్టకపోవడంతో శిథిలావస్థకు చేరాయి. కాలం చెల్లిన పై కప్పులు పెచ్చులూడి పడుతుండటంతో అంగన్‌వాడీ కేంద్రాలను అద్దె భవనాల్లోకి మార్చుకుంటున్న దుస్థితి నెలకొంది.

మండలంలోని 28 కేంద్రాలు..

సొంత భవనాలు 19 కాగా, అద్దెభవనాల్లో 15 కేంద్రాలు కొనసాగుతున్నాయి. అద్దెలేని భవనాల్లో గ్రామ పంచాయతీ, లేదా ఇతర ప్రభుత్వ భవనాల్లో) 28 కేంద్రాలు కొనసాగుతున్నాయి. క్యాతన్‌పల్లి, గడిముస్కన్‌పల్లి, కందెన్‌పల్లి గ్రామాల్లోని మూడు కేంద్రాల భవనాలు శిథిలావస్థకు చేరడంతో ఇటీవల అద్దెభవనాల్లోకి మార్చారు. కందెన్‌పల్లిలో సొంతభవనంలో కొనసాగుతున్న మరో అంగన్‌వాడీ కేంద్రంలో కలిపారు. ఇక మూడు కేంద్రాల్లో అంగన్‌వాడీ టీచర్‌లు లేక కేంద్రాలను మరో కేంద్రంలో కలిపి నిర్వహిస్తున్నారు. దాదాపు 14ఆయా పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ప్రభుత్వం శిథిలాస్థలో ఉన్న భవనాలను మరమ్మతులు, ఇతర మౌళిక సదుపాయాలను కల్పించాలని చిన్నారుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

పెచ్చులు ఊడిపడుతున్నాయి..



సొంత అంగన్‌వాడీ భవనంలో కాలంచెల్లిన పైకప్పులు ఊడిపడుతున్నాయి. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. అద్దె భవనంలోకి కేంద్రాన్ని మార్చాలని అధికారులు ఆదేశించడంతో అద్దెభవనంలోకి కేంద్రాన్ని తరలించాం. సొంత భవనానికి మరమ్మతు చేపడితే సౌకర్యంగా ఉంటుంది.

– వెంకటమ్మ, అంగన్‌వాడీ టీచర్, క్యాతన్‌పల్లి

అద్దెభవనాల్లోకి తరలించాం..

మండలంలోని క్యాతన్‌పల్లి, గడిముస్కన్‌పల్లి, కందెన్‌పల్లి గ్రామాల్లో సొంతభవనాల్లో కొనసాగుతుండగా పై కప్పులు శిథిలావస్థకు చేరి పెచ్చులూడి పడుతుండటంతో అద్దెభవనాల్లోకి మార్చాం. ప్రస్తుతం కొనసాగుతున్న భవనాల్లో ఎలాంటి ప్రమాదం లేదు. అద్దె భవనాల్లో సదుపాయాల కొరత ఉంది.

– వెంకటేశ్వరమ్మ, ఇన్‌చార్జి సీడీపీఓ, ఐసీడీఎస్ మద్దూరు ప్రాజెక్టు

రోడ్డు భద్రతా నిబంధనలు పాటించాలి



మాట్లాడుతున్న ఆర్టీఓ మేఘా గాంధీ



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న పోలీస్ అధికారులు

నారాయణపేట రూరల్: వాహనదారులు తప్పకుండా రోడ్డు భద్రతా నియమాలను పాటించాలని ఆర్టీఓ మెఘా గాంధీ సూచించారు. బుధవారం మండలంలోని కొల్లంపల్లి జెడ్పీస్కూల్లో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు.. రోడ్డు ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, వాహనాలు నడిపే సమయంలో తప్పకుండా హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించాలన్నారు. అనంతరం ఎస్‌ఐ రాయుడు మాట్లాడుతూ.. సైన్ బోర్డ్, సిగ్నల్స్, సైబర్ నేరాలు, షీ టీం తదితర విషయాలను తెలియజేశారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

మహిళల ప్రత్యేక రక్షణకు షీటీం

నారాయణ పేట ఎడ్యుకేషన్: ఎస్పీ ఆదేశాల మేరకు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో షీ టీం బృందం బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ శివశంకర్, ఎస్‌ఐ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. విద్యార్థులకు షీటీం సేవల గురించి, వేధింపులకు గురైన సమయాల్లో షీ టీంను సంప్రదించాల్సిన ఆవశ్యకత, విద్య ప్రాముఖ్యత గురించి వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి విరాళం

నారాయణపేట రూరల్: మండలంలోని అంత్వార్‌లో శ్రీ ఆంజనేయస్వామి ఆలయ అభివృద్ధికి అదే గ్రామానికి చెందిన అంకెల శ్రీనివాస్ గౌడ్, సాయి కృష్ణ గౌడ్ రూ. 51వేలు విరాళం అందించారు. ఆలయంలో ఆయిల్ పెయింటింగ్, దేవతల చిత్రాలు వేయించారు. కార్యక్రమంలో భాస్కర్ గౌడ్, వెంకటయ్య, తిరుపతి, శివశంకర్, బాబు, గంగరాం, జయరాం, నారాయణ పాల్గొన్నారు.

కర్ని గ్రామంలో..

మక్తల్: మండలంలోని కర్నిలో లింగమయ్య ఆలయ అభివృద్ధికోసం చిట్యాల గ్రామానికి చెందిన రహెమత్ పాష గ్రామస్తులకు విరాళంగా లక్ష రూపాయలు అందజేశారు. అనంతరం గ్రామస్తులు రహిమత్ పాషను శాలువాతో సన్మానం చేశారు. కార్యక్రమంలో రంగప్ప, గ్రామస్తులు శ్రీనివాస్‌గౌడ్, పట్నం బాలప్ప, అంజప్ప, హన్మంతు తదితరులు పాల్గొన్నారు.



పేటలో విరాళం అందిస్తున్న దాత..

విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకోవాలి

ఊట్కూర్: విద్యార్థులు లక్ష్యంతో చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఎమ్మెల్యే డాక్టర్ వాకిటి శ్రీహరి అన్నారు. బుధవారం మండలంలోని అన్ని పాఠశాలల పదోతరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ ఆశయంతో చదివి ఉన్నత కొలువులు సాధించి తల్లిదండ్రులకు, గ్రామానికి మంచి పేరును తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో డీఈఓ గోవిందరాజులు, ఎంఈఓ రాంచంద్రాచారి, నాయకులు ఎల్కోటి నారాయణ రెడ్డి, విజయసింహారెడ్డి, మహేశ్‌రెడ్డి, దత్తు, మోహన్ రెడ్డి పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

కృష్ణా: రైతుల ఖాతాలో యాసంగికి సంబంధించిన రైతు భరోసా డబ్బులు జమ చేయడంతో బుధవారం మండలంలోని ఆలంపల్లిలో రైతులతోపాటు కాంగ్రెస్ నాయకులు సీఎం రేంవత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు.. ప్రభుత్వం తమ ఖాతాలో నిధులు జమచేయడంతో హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు రాజప్పగౌడ, సిద్ధప్పగౌడ, సూగప్పగౌడ, మారెప్ప, గౌరప్ప తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో అమావాస్య పూజలు



కాల బెలుగుందిలో స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు



దామరగిద్దలో స్వామి వారికి పూజలు చేస్తున్న భక్తులు

నారాయణపేట రూరల్: అమావాస్యను పురస్కరించుకొని పట్టణంలోని వివిధ శైవ ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. సింగర్ బేస్ శివలింగేశ్వర ఆలయం, గాంధీనగర్ లింగయ్య గుడి, మహంకాళి వీధి శివాలయం, బారంబావి శివాలయం తదితర ఆలయాల్లో భక్తిశ్రద్ధల మధ్య పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాద వితరణ చేపట్టారు.

వీర భద్రేశ్వర స్వామి ఆలయంలో

దామరగిద్ద: అమావాస్య పర్వదినం సందర్భంగా మండలంలోని క్యాతన్‌పల్లి వీర భద్రేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు శరణయ్యస్వామి సమక్షంలో స్వామివారికి అభిషేకం అలంకరణ తదితర పూజలు చేపట్టారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు భక్తులు పాల్గొన్నారు.

ఆంజనేయస్వామి ఆలయంలో..

మరికల్: మండల కేంద్రంలోని ఆంజనేయస్వామి, శివాలయంలో బుధవారం భక్తులు అమావాస్య పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో సుందరయ్యశర్మ భక్తులచే ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం గ్రామస్తులకు తీర్థప్రసాదాలతోపాటు అన్నదానం నిర్వహించారు. బసంత్, నాగరత్నమ్మ, హన్మిరెడ్డి, నారాయణ, రాయుడు, వెంకటేష్, తిరుపతయ్య పాల్గొన్నారు.



మరికల్‌లో..

ఆలయంలో బ్యాగుల పంపిణీ

మండల కేంద్రంలోని పడమటి ఆంజనేయస్వామి ఆలయంలో ప్లాస్టిక్‌ను నిషేదిస్తు బుధవారం ఆలయ కమిటీ సభ్యులు తీర్మానించారు. ఈ సందర్భంగా ఆలయం పేరుతో తయారుచేసిన బుట్ట బ్యాగులను విడుదల చేసి భక్తులకు అందజేశారు.

కాచువాగు శివాలయంలో..

మద్దూరు: అమావాస్యను పురస్కరించుకొని మండలంలోని కాచువాగు శివాలయం, దోరేపల్లిలోని గండిహనుమాన్ ఆలయంలో అన్నదానం చేశారు. అలాగే మండలంలోని పలుదేవాలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

క్రీడాకారులకు సన్మానం

మద్దూరు: జాతీయ స్థాయిలో నిర్వహించిన ఖోఖో, రగ్బీ క్రీడల్లో పాల్గొన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాజశేఖర్‌రెడ్డి, పాశం వరుణ్, శివను ఉపాధ్యాయులు బుధవారం పాఠశాల ఆవరణలో సన్మానించారు. క్రమశిక్షణతో ఆడుతూ క్రీడల్లో ప్రతిభ కనబరిచి పాఠశాలకు మంచిపేరు తీసుకురావాలని హెచ్‌ఎం సవిత తెలిపారు. కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్ వెంకటప్ప, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

రేపు 'ఉపాధి'హామీ బహిరంగ సభ

నారాయణపేట రూరల్: మండలంలోని వివిధ గ్రామాల్లో జరిగిన ఉపాధి హామీ పథకం పనులకు సంబంధించి శుక్రవారం బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ సుదర్శన్ తెలిపారు. 14వ విడత సామాజిక తనిఖీలో భాగంగా ఈ నెల 23నుంచి ప్రారంభమైన గ్రామసభలు గురువారంతో ముగిస్తాయన్నారు. వాటికి సంబంధించిన ఫిర్యాదులు, అవకతవకలు, రికవరీ తదితర అంశాలపై చర్చించనున్నట్లు తెలిపారు. బహిరంగ సభకు అన్ని గ్రామాల ప్రతినిధులు హాజరు కావాలని కోరారు.

వాల్‌పోస్టర్ విడుదల

కోస్గి: ఫిబ్రవరి 4, 5వ తేదీలలో భద్రాచలంలో జరిగే పీడీఎస్‌యూ తెలంగాణ రాష్ట్ర జనరల్ కౌన్సిల్‌ను జయప్రదం చేయాలని జిల్లా అధ్యక్షుడు సాయికుమార్ అన్నారు. బుధవారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు.. రాష్ట్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజనం చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు గౌస్, సహాయ కార్యదర్శి వెంకటేష్, నవీన్, కవిత, నరేష్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు వినతి



ధన్వాడ: యువక మండలి భవన నిర్మాణం కోసం స్థలం కేటాయించాలని కోరుతూ.. యువక మండలి ఆధ్వర్యంలో బుధవారం తహసీల్దార్ సింధుజాకు వినతి పత్రం అందజేశారు. ప్రకాష్, బాల్‌రాజు, సాకలిరాజు, ఇర్ఫాన్, నవీన్, ఇషాక్ ఉన్నారు.

అవార్డు గ్రహీతకు సన్మానం



కృష్ణా: మండలంలోని కున్సీ వేణుగోపాలస్వామి ఆలయ అర్చకుడు శ్రీకాంతచారికి ఇటీవల తిరుమల తిరుపతి దేవస్థానం వారు జ్యోతిష్య బ్రహ్మ అవార్డును అందించడంతో బుధవారం ఆలయంలో గ్రామస్తులు సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు సోమశేఖర్‌గౌడ్, నర్సప్ప, రాంచందర్, పిట్టల్ సిద్దప్ప, రాజు, విశ్వనాథ్‌రెడ్డి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు సన్మానం

మండల తహసీల్దార్ వెంకటేష్‌ను జిల్లా బీసీ సంఘం ప్రధాన కార్యదర్శి వాకిటి భీమశంకర్ ఆధ్వర్యంలో ముడుమాల్ గ్రామస్తులు బుధవారం శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో బీసీ సంఘం నాయకులు తదితరులు ఉన్నారు.

ఏంఎస్‌ఎంఈ డైరెక్టర్‌కు వినతి

దామరగిద్ద: మండలంలోని అన్నసాగర్ గ్రామానికి చెందిన ప్రధాన మంత్రి విశ్వకర్మ యోజన పథకం లబ్ధిదారులు బుధవారం రాష్ట్ర రాజదానిలోని ఏంఎస్‌ఎంఈ అడిషనల్ డైరెక్టర్ శ్రీనివాస్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. జిల్లా కేంద్రంలో శిక్షణ కేంద్రం ఏర్పాటు చేయాలని దరఖాస్తు చేసుకున్న వారికి శిక్షణ అందించి ప్రొత్సహక రుణాలు అందించాలని కోరారు. కార్యక్రమంలో మోహన్‌రాజ్, వెంకటప్ప, నర్సింహులు, రమేష్ మధు, శ్రీనివాస్, నరేష్, కిష్టప్ప తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే పర్యటన

నర్వ: నేడు మండలంలోని పీఏసీఎస్‌వద్ద కందుల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్నట్లు మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బీసం చెన్నయ్యసాగర్ తెలిపారు. ఈ కేంద్రాన్ని ప్రారంభించేందుకు ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి హాజరవుతున్నారన్నారు. మధ్యాహ్నం ఈ కేంద్రాన్ని ప్రారంభిస్తారన్నారు. ఈ కార్యక్రమాలను విజయవంతం చేసేందుకు పార్టీ కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు హాజరు కావాలన్నారు.

2న పూసల్ పహాడ్ టాలెంట్ టెస్ట్

నారాయణపేట రూరల్ : పదోతరగతి చదువుతున్న విద్యార్థులకు ఫిబ్రవరి 2న పూసల్ పహాడ్ టాలెంట్ టెస్ట్ నిర్వహిస్తున్నట్లు శేరి కృష్ణారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 22వ సారి అన్ని యాజమాన్య పాఠశాలల విద్యార్థులకు తెలుగు, ఇంగ్లిష్ మీడియంలో పరీక్ష ఉంటుందన్నారు. అన్ని మండలాల్లో పరీక్ష కేంద్రం ఉంటుందని, 150 మార్కులకు మల్టిపుల్ చాయిస్ విధానంలో బబ్లింగ్ చేయాలని, రెండు గంటల సమయం ఉంటుందన్నారు. అన్ని సబ్జెక్టులకు సంబంధించిన ప్రశ్నలు ఉంటాయని, పూర్తి సిలబస్ ప్రిపేర్ కావాలన్నారు. విద్యార్థులు ఈ నెల 30లోపు సంబంధిత పాఠశాలల హెచ్‌ఎంల వద్ద పేర్లు నమోదు చేయించుకోవాలని సూచించారు.

రెండు లారీలు ఢీ.. తప్పిన ప్రమాదం



మరికల్: మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద రెండు లారీలు ఢీకొన్నాయి. ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. బుధవారం రాయిచూర్ నుంచి వస్తున్న లారీ ముందు వెళ్తున్న టిప్పర్‌ను ఢీకొనడంతో లారీ ముందుభాగం దెబ్బతింది. ఘటన స్థలానికి వెళ్లిన పోలీసులు ప్రమాదానికి కారణమైన డ్రైవర్‌ను బయటకు దించి చూడగా మద్యం తాగి ఉండటంతో కేసు నమోదు చేశారు. ఈ ప్రమాదంలో ఇద్దరు డ్రైవర్లకు ప్రమాదం జరగలేదని ఎస్‌ఐ రాము తెలిపారు.

సీఐ శివకుమార్‌కు సన్మానం



ఆత్మకూర్: జిల్లా ఉత్తమ సీఐగా అవార్డు అందుకున్న ఆత్మకూర్ సీఐ శివకుమార్‌ను నాయకులు బుధవారం ఆయన కార్యాలయంలో పూలమాల, శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉత్తమ సేవలు అందిస్తూ బాధితులకు అండగా నిలుస్తున్నారని కొనియాడారు. కార్యక్రమంలో ఎస్‌ఐ నరేందర్, నాయకులు ఏటికాడి ఆనంద్, ప్రభాకర్‌రెడ్డి, చాయపత్త శ్రీనివాసులు, నాగన్న, వెంకటన్న, గద్వాల శ్రీను, రామచంద్రయ్య, సురేందర్, నరేందర్, శ్రీహరి, వెంకటేశ్వర్‌గౌడ్, మహ్మద్, పోలీసు సిబ్బంది తదితరులు ఉన్నారు.

నర్సరీ పరిశీలన

మద్దూరు: మండలంలోని దోరేపల్లిలో ఉపాధి నిధులతో చేపట్టే వన నర్సరీని బుధవారం ఎంపీడీఓ నర్సింహారెడ్డి, ఎంపీఓ రామన్న పరిశీలించారు. ఈ గ్రామంలో వనమహోత్సవం కోసం 4,500 మొక్కలను పెంచడానికి బ్యాగులను సిద్ధం చేసినట్లు ఏపీఓ తెలిపారు. నాణ్యమైన మొక్కలను, ప్రజలకు అవసరపడే మొక్కలను మాత్రమే పెంచాలని ఎంపీడీఓ వారికి ఆదేశించారు.

'బండి సంజయ్‌ను బర్తరఫ్ చేయాలి'




మాట్లాడుతున్న నాయకులు

ఆత్మకూర్: ప్రజా గాయకుడు గద్దర్‌ను అవమానించిన బండి సంజయ్‌ను కేంద్ర ప్రభుత్వం మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేయాలని ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక అతిథిగృహంలో బీఆర్‌ఎస్, సీపీఎం, సీపీఐ, మాస్ లైన్, ఎమ్మార్పీఎస్, శాంతిసంఘం, వాల్మీకిసంఘం నాయకులు రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. బండి సంజయ్ గద్దర్‌ను అవహేళన చేస్తూ మాట్లాడడం విచారకరమని, బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఎస్ శెట్టి, రవికుమార్‌యాదవ్, రాజు, ప్రసాద్, మండ్లరామకృష్ణ, రాబర్ట్, మాసన్న, మోష తదితరులు ఉన్నారు.

'అభివృద్ధి విస్మరించారు'

అమరచింత: మండలంలోని కొంకన్‌వానిపల్లిలో కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధిని విస్మరించిందని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కుతుబ్ మండిపడ్డారు. ప్రభుత్వం ఏర్పడి 15 నెలల కాలం దాటుతున్నా గ్రామంలో డ్రెయినేజీలు, సీసీ రహదారుల నిర్మాణాలకు నిధులు మంజూరు చేయకపోవడం దారుణమన్నారు. గ్రామంలో సీసీ రోడ్ల కోసం కేటాయించిన రూ.15 లక్షలతో కాంగ్రెస్ పార్టీ నాయకులు నాసిరకంగా సీసీ రహదారులు వేశారని ఆరోపించారు. కార్యక్రమంలో శ్రీను, గోవింద్, రాములు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి

అర్హులందరికీ ఇళ్లు ఇవ్వాలి

ఆత్మకూర్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఇందిరమ్మ ఇళ్లను అర్హులందరికీ మంజూరు చేయాలని సీపీఐ నాయకులు రాబర్ట్, మోష బుధవారం అర్హులతో కలిసి ఎంపీడీఓ శ్రీరాంరెడ్డికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు భీమన్న, ఉపేందర్, శాంతమ్మ, పద్మ, చంద్రమ్మ, వెంకటన్న తదితరులు ఉన్నారు.



ఎంపీడీఓకు వినతి పత్రం ఇస్తున్న నాయకులు